ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శనివారం 21 డిసెంబరు 2024



శిలాఫలకం ఆవిష్కరిస్తూ..



ఎడతెరిపిలేని వాన

- బలపడిన అల్పపీడనం
- రోజంతా కురిసిన వర్షం
- తడిసి ముద్దయిన వరి కుప్పలు
- నేడూ వర్షాలు కురిసే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. దీంతో జిల్లాలో శుక్రవారం రోజంతా వాన కురిసింది. పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరుతో పాటు 15 మండలాల్లోనూ భారీగా వర్షం పడింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. ఇప్పటికే మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల వరిపైరు మొత్తం తడిసి ముద్దయింది. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పినా పంటంతా నానిపోయింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శనివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

6లో

మాట ఇస్తున్నా.. ఒళ్లొంచి పనిచేస్తా..

- గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు
- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



పార్వతీపురం/సాలూరు/సాలూరు రూరల్/మక్కువ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాట ఇస్తున్నా.. ప్రజల కోసం ఒళ్లొంచి పనిచేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం సాలూరు మండలం సిరివర రోడ్డు పనులకు సంబంధించి మక్కువ మండలం బాగుజోల వద్ద శంకుస్థాపన చేశారు. తొలుత ఆయన సాలూరు నుంచి మండలంలో మామిడిపల్లి మీదుగా మక్కువ మండలం బాగుజోలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనలో పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల రోడ్ల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం సిరివరకు రూ. 9.50 కోట్లతో నిర్మించనున్న 9 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. జోరు వాన కురుస్తున్నా.. బురదలో కిలోమీటరు వరకు నడుచుకుంటూ కొండపై ఉన్న చిలక మెండంగి గ్రామానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించారు. స్థానికులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం తిరిగి ఆయన బాగుజోలకు చేరుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గిరిజనుల కష్టాలు తెలుసుకోవడానికే వచ్చా. రాష్ట్రంలో బీటీ,సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు తదితర వాటి నాణ్యతపై ప్రజలు గట్టిగా నిలబడాలి. నాణ్యతపై ప్రజలు ప్రశ్నిస్తే కలెక్టర్ మరింత చురుగ్గా పనిచేయడానికి వీలుంటుంది. సిరవర రోడ్డు పనులను డిప్యూటీ సీఎం పేషి నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తాం' అని పవన్ అన్నారు.

ఏ కష్టమొచ్చినా తెలియజేయాలి..

'ప్రజల సంక్షేమం కోసం నాతో పాటు పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, నేను ఉన్నాం. మేమంతా కష్టపడి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. యువతకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. గిరిజన యువత వివిధ నైపుణ్యాల సాధనకు కృషి చేయాలి. నైపుణ్యాలు సాధిస్తే ఉపాధి అవకాశాలు వస్తాయి. మన్యంలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం దృష్టికి తేవాలి.' అని డిప్యూటీ సీఎం అన్నారు.



బాగుజోలలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఆ నిధులు ఏం చేశారో?

'గత ప్రభుత్వం మద్యంపై 25 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చింది. మూడు జిల్లాల్లో వివిధ ఆస్తులు తాకట్టు పెట్టి 15 వేల నుంచి 20 వేల కోట్ల వరకు రుణాలు తెఇచ్చారు. అయినా గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయలేకపోయారు.. వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది.' అని ఉప ముఖ్యమంత్రి పవన్ అన్నారు.

నిధుల సమస్య ఉన్నా..

'ప్రతి రెండు నెలలకొకసారి మన్యం ప్రాంతాల్లో పర్యటిస్తా. క్షేత్రస్థాయిలో పర్యటించి గిరిజన గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తా. సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి ఉపాధి హామీ పథకం కింద రూ.రూ.46 కోట్లతో అల్లూరి, పార్వతీపురం జిల్లాల్లో 19 పంచాయతీలకు రోడ్లు మంజూరు చేశాం. నిధులకు కొంత ఇబ్బంది ఉన్నా.. కేంద్రం నుంచి ఉపాధి హామీ నిధులు తెచ్చి రోడ్ల నిర్మాణాలకు చేస్తున్నాం. కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు పార్వతీపురం మన్య జిల్లా సవర సంస్కృతి పెయింటింగ్ అందించా.' అని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం పనసభద్ర, పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4 కోట్ల మేర చెక్కును ఉపముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

గిరిజనుల సంక్షేమం కోసం..

గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 'డోలీమోతలకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆసుపత్రి ఏర్పాటు చేశాం. గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేస్తున్నాం. ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ, జగదీశ్వరి, మాధవి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక , ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా తదితరులు పాల్గొన్నారు.

పవన్ పర్యటన ఇలా...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం 11 గంటల తరువాత సాలూరుకు చేరుకున్నారు. ఆయన రాకతో పట్టణవాసులు కేరింతలు కొట్టారు. తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కారు నుంచి బయటకు వచ్చి పవన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మామిడిపల్లి మీదుగా కాన్వాయ్ సాగింది. అన్నంరాజువలస వద్దకు వచ్చే సరికి ప్రకృతిని చూసి కాన్వాయ్‌ను ఆపించి కిందకు దిగారు. రోడ్డుపై కాసేపు నడిచి ప్రకృతిని తిలకించారు. ఆయన మళ్లీ కాన్వాయ్ ఎక్కి శంబర మీదుగా బాగుజోలకు చేరుకున్నారు. సమావేశంలో కొందరు అభిమానలు కాబోయే సీఎం, సీఎం అంటూ నినాదాలు చేస్తుండడంతో ఈ నినాదం ఇంకా పోలేదని చమత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి

- జోరువానలో గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన

8లో

రామతీర్థంలో సహస్ర శ్లోక పారాయణం

- ప్రత్యేక అలంకరణలో రాములవారు
- దర్శించి పులకించిన భక్తులు

7లో

జ్వరంతో గిరిజన బాలిక మృతి

- భామిని మండలంలో ఘటన
- శోక సంద్రంలో తల్లిదండ్రులు

8లో

యువగళం-నవశకం

సువర్ణాధ్యాయం

- మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

6లో

గజరాజుల బీభత్సం

- గరుగుబిల్లి, భామిని మండలాల్లో హల్‌చల్
- పంటలకు నష్టం
- ఆందోళనలో రైతులు

గరుగుబిల్లి/భామిని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి, భామిని మండలాల్లో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పొలాల్లో సంచరిస్తూ పంటను ధ్వంసం చేస్తున్నాయి. మరోవైపు రహదారులకు అనుకుని ఏనుగులు హల్‌చల్ చేస్తుండడంతో గ్రామస్థులు, రైతులు హడలెత్తిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు జియ్యమ్మవలస మండలం చినకుదమ, పెదకుదమ గ్రామాల్లో సంచరించిన ఏడు గజరాజుల గుంపు గురువారం రాత్రి గరుగుబిల్లి మండలం సంతోషపురం మీదుగా సుంకి చేరుకున్నాయి. శుక్రవారం ఆ రెండు గ్రామాల్లో పొలాల్లోని వరి కుప్పలను ధ్వంసం చేశాయి. ప్రస్తుతం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెరువులో అవి సేదతీరుతున్నాయి. ఒకవైపు తుపాన్, మరోవైపు ఏనుగుల గుంపు సంచారంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మరోవైపు భామినిలో ఉన్న నాలుగు ఏనుగులు గురువారం రాత్రి ఆ ప్రాంతంలో ధాన్యం కుప్పలు, పత్తిమూటలు, పైపులు, కూరగాయలు, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.



సుంకిలో వరి కుప్పలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు



భామినిలో ధాన్యం నిల్వలను చిందరవందర చేసిన గజరాజులు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ

మోడల్ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక

- నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్‌కుమార్

భామిని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోడల్ ఆదివాసీ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. మనుమకొండ, నల్లరాయిగూడ, సన్నాయి గూడ, పాలీస్‌కోట గిరిజన పంచాయతీల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై చర్చించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, అంగన్‌వాడీ, వ్యవసాయం, తాగునీరు, హౌసింగ్ తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం నల్లరాయిగూడ, పాలీస్‌కోట, సన్నాయిగూడ, సొలికిర గ్రామాల్లో పర్యటించారు. సన్నాయిగూడ గ్రామంలో గిరిజన ప్రైమరీ పాఠశాలను, అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. వన్‌ధన్ వికాస్ కేంద్రంలో సభ్యులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య, ఇళ్ల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు సదుపాయాలు వంటి విషయాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో నీతి అయోగ్ యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్‌కుమార్, ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, ఎంపీడీవో చంద్రరావు, తహసీల్దార్ అప్పారావు, ఏవో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అడ్వంచర్ పార్క్ సందర్శన

సీతంపేట రూరల్: సీతంపేటలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌ను నీతి అయోగ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా సభ్యులు పార్క్‌లో సాహస క్రీడలు, 5డి థియేటర్‌ను పరిశీలించారు. అనంతరం వారు ఆదలి వ్యూపాయింట్‌ను సందర్శించారు.

మంత్రివర్యా పరిష్కరించరూ..!

- పక్కా రోడ్లున్నా అనేక గ్రామాలకు చేరని ఆర్టీసీ బస్సులు
- సుదూర ప్రాంతాలకు సర్వీసులు కరువు
- కాలం చెల్లిన వాహనాలతో నెట్టుకొస్తున్న వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు
- రవాణా శాఖ మంత్రికి సమస్యల స్వాగతం

పార్వతీపురం/పార్వతీపురం టౌన్/బెలగాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాగా ఆవిర్భవించి మూడేళ్లు గడుస్తున్నా.. ఆర్టీసీ గాడిన పడలేదు. ఇంకా అనేక గ్రామాలకు బస్సులు చేరడం లేదు. పక్కా రహదారులు ఉన్నప్పటికీ ఆర్టీసీ సేవలు అందకపోవడంతో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సదుపాయం కల్పించాలని ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మరికొన్ని గ్రామాలకు చెందిన వారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే సమయంలో ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో కాలం చెల్లిన బస్సులెన్నో ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ సర్కారు కొత్తగా బస్సులను కొనుగోలు చేయలేదు. దీంతో పాత బస్సులనే నేటికీ తిప్పుతున్నారు. అయితే ఒక్కోసారి అవి మరమ్మతులకు గురై మార్గ మధ్యంలో ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు సిబ్బంది కూడా నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు కొంతమంది ఆర్టీసీ అధికారులతో పాటు సిబ్బంది కూడా ప్రయాణికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అడిగినా పట్టించుకోని పరిస్థితి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. ఇక పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు అపరిశుభ్రంగా దర్శన మిస్తున్నా స్పందించే వారే కరువయ్యారు. దీనిపై మంత్రి స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకపోతే జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్, విజయవాడ, భీమవరం, తిరుపతి, అన్నవరం, సంహాచలం తదితర ప్రాంతాలకు రోజూ సర్వీసులు నడపడంతో పాటు విశాఖ, విజయనగరం ప్రాంతాలకు నాన్‌స్టాప్ బస్సులు వేయాని, శ్రీకాకుళానికి సర్వీసులు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





జిల్లా కేంద్రానికి చేరుకున్న మంత్రి

తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి పార్వతీపురంలో ఆయనకు ఎమ్మెల్యే విజయచంద్ర, టీడీపీ శ్రేణులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నియోజవర్గ పరిస్థితులు, తదితర అంశాలను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏడు కొత్త బస్సులను మంత్రి ప్రారంభించనున్నారు. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామ సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణ కేంద్రం, సీతానగరంలో బస్ షెల్టర్, పార్వతీపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించ నున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏకధాటి వానతో అగచాట్లు

- తడిసి ముద్దయిన రైతు కష్టం
- పంట నష్ట నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు
- నీటమునిగిన విశాఖ-అరకు ప్రధాన రహదారి
- జనజీవనం అస్తవ్యస్తం

(ఆంధ్రజ్యోతి బృందం)

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో ఇటు రైతులు, అటు సామాన్యులు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా రైతులకు తీరని నష్టాన్నే మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి ముద్దయింది. పొలాల్లో మిగిలిన పంటను సంరక్షించుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. పొలాల్లో నీటిని బయటకు మళ్లించే చర్యలకు ఉపక్రమించారు. కొన్నిచోట్ల మొక్కజొన్న పంట సైతం నీట మునిగింది. పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. పంట నష్ట నివారణ పలు సూచనలు చేశారు. కాగా, శుక్రవారం ఉదయం నుంచి ఎడతెగని వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రహదారులు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రాజాం మండలంలో వర్షాలతో అన్నదాతలకు అగచాట్లు తప్పడంలేదు. రైతులు పొలాల్లోనే గడపాల్సివస్తోంది. పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వంగర మండలంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి ముద్దయింది. కోసిన పంటలు నీటిలో మునిగింది. కోయాల్సిన పంటలు గింజలు రాలుతున్నాయి. వరి కుప్పలు తడవడంతో పంట నష్టం జరిగింది. గజపతినగరంలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట నీట మునిగింది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులు వరి కోతలు అయిన వెంటనే మండలంలోని తుమ్మికాపల్లి, లోగిస, కెంగు, పిడిశీల, సీతారామపురం తదితరగ్రామాల్లో సుమారు 250హెక్టార్లలో మొక్కజొన్న విత్తనాలు వేశారు. పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంతకవిటి మండలంలో చేతికొచ్చిన పంట నీటి పాలైంది. చేను నూర్చాల్సిన సమయంలో అకాల వర్షం రైతులను ముంచేసింది. శృంగవరపుకోట పట్టణంలోని విశాఖ-అరకు రోడ్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వరద నీటితో నిండింది. భోగాపురం మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పొలాల్లో నిల్వ ఉంచిన వరిచేను తడిసి ముద్దయింది. జాతీయ రహదారిపై నీరు నిలవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. భోగాపురం మండలంలోని తీర ప్రాంత గ్రామాలు ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజు పాలెంకు చెందిన మత్స్యకారులకు వేట సామగ్రి సంరక్షణకు పడరాని పాట్లు పడ్డారు. బొబ్బిలి వీరఘట్టం మండలాల్లో రైతులు పంట సంరక్షణకు ఆపసోపాలు పడ్డారు. పార్వతీపురం పట్టణంలో శుక్రవారం రాత్రి వరకు కురుస్తోంది. దీంతో జనజీవనానికి అటంకం కలిగింది. సీతానగరం మండలంలోని లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస, బూర్జ గ్రామా నుంచి చెరకు పంట సుగర్ ఫ్యాక్టరీకి చేర్చడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. వరి చేనుతో పాటు మినప, పెసర పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు భయపడుతున్నారు. బాడంగి మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి శిరీష అవగాహన కల్పించారు. రామభద్రపురం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లోనే వరిధాన్యం ఉండిపోవడం పొలాల్లో నీరు ఎక్కువగా చేరడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. భామిని మండలంలో కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తరలింపు, వరి కుప్పల సంరక్షణకు రైతులు యత్నిస్తున్నారు.. టమాటా, క్యాబేజీ, వంకాయ, మిరప పంటలకు వర్షాలతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాలూరు మండలంలో గురువారం రాత్రి ఆరంభమైన వర్షం శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన నిరంతరం ఎడతెగకుండా కురుస్తునే ఉంది. వర్షం దాటికి సాలూరు,పాచిపెంట మండలాల్లో ఇంకా కోత కోయని వరిపంట అక్కడక్కడ నేలవాలింది. ధాన్యం, వరి కుప్పల సంరక్షణలో బిజీగా ఉన్నారు. రాజాం మండలంలో కోసిన వరి చేను తడిసి పాడవుతుందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పెసర. మినప పంటలు కూడా పంటదశకు రావడంతో రైతులు వాటిని కూడా కాపాడు కోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజాం పురపాలక సంఘం పరిధిలోని నిరుపేదల కోసం నిర్మిస్తున్న జగనన్న కాలనీ రహదారి అధ్వానంగా మారింది. బొండపల్లి మండల వ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడంతో వరిచేను నీటమునిగి తడిసి ముద్దయింది.


రాజాం రూరల్: ఎం.జె.వలస ప్రాంతంలో నాటుబండ్లుపై వరిని తరలిస్తున్న రైతులు


వంగర: వీవీఆర్ పేటలో తడిసి ముద్దయిన వరి కుప్పలు


సీతానగరం: లక్ష్మీపురం కాటా సెంటర్ వద్ద వర్షంలో చెరకు లోడింగ్


గజపతినగరం: తుమ్మికాపల్లిలో నీటమునిగిన మొక్కజొన్న


రాజాం: జగనన్న కాలనీకి వెళ్లే రహదారి


ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

జగన్ బొమ్మలు తొలగిస్తున్నాం

- బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బొబ్బిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో శాఖపరంగా జరుగుతున్న కార్యకలాపాలపై ఆర్డీవో జె.వి.ఎస్.ఎస్. రామ్మోహనరావు స్పష్టంచేశారు. డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖా అయ్యారు.

ప్రశ్న: భూసర్వే రాళ్లు, పట్టాదారు పుస్తకాలపై జగన్ ఫొటోల తొలగింపులు చేపట్టారా?

జవాబు: బొబ్బిలి డివిజన్ పరిధిలో సుమారు 50 వేలకు పైగా సర్వేరాళ్లు ఉన్నాయి. ముందుగా డివిజన్‌కు రెండు మండలాలను ఎంపిక చేసి మాజీ సీఎం జగన్ బొమ్మల తొలగింపు చేపట్టాం. ఇందులో భాగంగా తొలుత బాడంగి, గజపతినగరం మండలాల్లో ఈ పనులు ప్రారంభించాం. రోజుకు ఐదువేల బొమ్మల తొలగింపు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం.

ప్ర: భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ సదస్సుల ప్రక్రియ ఎలా జరుగుతోంది?

జ: రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన లభిస్తోంది. భూ సమస్యలకు సంబంధించి అనేక మంది తమ అర్జీలను అందజేస్తున్నారు. ముఖ్యంగా తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూముల రికార్డులు తారుమారయ్యాయని, మ్యూటేషన్‌లు చేయాలని, పాసుపుస్తకాలు జారీ చేయాలని ఇలా అనేక సమస్యలు వస్తున్నాయి. సాధ్యమయ్యే వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాం. సాధ్యం కాని వాటి విషయాన్ని అక్కడికక్కడే బహిరంగంగా వెల్లడిస్తున్నాం. బొబ్బిలి మండలంలోని పలు గిరిజన గ్రామాలలో భూసమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరిస్తున్నాం.

ప్ర: ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు?

జ: ఇంతవరకు 627 అర్జీలు వచ్చాయి. వాటిలో 40 సమస్యలను పరిష్కరించాం. జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయి. మ్యూటేషన్‌కు సంబంధించిన అర్జీలను జేసీకి నివేదిస్తున్నాం. పేర్లు మార్పిడి, తప్పుల సవరణ, సరిహద్దుల నిర్ణయం వంటివాటిని క్షుణ్ణంగా పరిశీలించిన నిర్ధారించుకొని తగిన పరిష్కారం చూపుతున్నాం.

ప్ర: రెవెన్యూ సదస్సులకు మిగిలిన శాఖలతో సమన్వయం ఎలా ఉంది?

జ: అటవీశాఖ, దేవాదాయశాఖ, వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల సమస్యలకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమన్వయంగా పనిచేస్తున్నాం. అన్ని శాఖల రికార్డుల ఆధారంగా లోటుపాట్లు ఉంటే సరిచేస్తున్నాం. ఆయా సమస్యల తీవ్రతను బట్టి నిబంధనల ప్రకారం 30 నుంచి 40 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టరు, జాయింట్ కలెక్టరు పర్యవేక్షణలో సదస్సులు ఆశాజనకంగా జరుగుతున్నాయి.

ప్ర: రేషన్ డిపో డీలర్ల పోస్టుల భర్తీకి అడ్డంకులు ఏమైనా ఉన్నాయా?

జ: డీలరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. ఏపీ సబార్డినేట్ రూల్స్ ప్రకారం పాత రికార్డులను ఆధారంగా చేసుకుని రిజర్వేషన్లు నిర్ణయించాం. దీనిపై కొంతమంది కొన్ని కారణాలు చూపుతూ కోర్టును ఆశ్రయించారు. ఈ నెలాఖరుకల్లా డీలరు పోస్టులను భర్తీ చేస్తాం. నియమించడానికి వీల్లేని పరిస్థితులు ఉత్పన్నమైతే అలాంటి చోట్ల తాత్కాలికంగా ఇన్‌చార్జి డీలర్లతో సరుకులు పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- రాష్ట్ర మంత్రి రామప్రసాద్‌రెడ్డి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ఈఎస్ఐపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖల మంత్రి రామప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ డిపోలో 10 నూతన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ ఔట్ అలవెన్సులు మంజూరు చేసిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిత్యం పని చేస్తుందన్నారు. కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్ల లాంటి వారని, వీరికి ఎటువంటి సమస్యలు వచ్చినా, నిత్యం అందుబాటులో ఉంటామని అన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీరం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కొత్త బస్సులు ప్రారంభిస్తోంద న్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలను, నగదు పారితోషికాన్ని మంత్రులు రామప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొర, ఈడీ విజయ్‌కుమార్, జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ, డిప్యూటీ సీపీఎం సుధాబిందు, ఆర్టీసీ యూనియన్ ప్రతినిదులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగరావు, ప్రదీప్ కుమార్, సూర్యరాములు, దుర్గరాజు, రామారావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.



నూతన బస్సులను ప్రారంభించిన మంత్రులు రామప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు


మంత్రి రామప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

26 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు...

- వివిధ స్టేషన్లలో హాల్ట్‌లు తాత్కాలికంగా తొలగింపు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట, విజయవాడ సెక్షన్‌లలో మూడో లైను నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 26 నుంచి పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడపనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519)కు ఈ నెల 26 నుంచి జనవరి 8 వరకూ కాజీపేట స్టేషన్‌లో హాల్ట్ ఉండదు. విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)కు జనవరి 8, 9 తేదీల్లో ఖమ్మం, వరంగల్ స్టేషన్లలో హాల్ట్ ఉండదు. ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), తిరుగు ప్రయాణంలోని భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రైళ్లకు జనవరి 6 నుంచి 8 వరకు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం టౌన్, మధిర స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045)కు జనవరి 6 నుంచి 8 వరకు, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046)కు జనవరి 7 నుంచి 9 వరకూ ఖమ్మం టౌన్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగామ, ఆలేరు, భువనగిరి స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22849)కు జనవరి 1, 8 తేదీల్లో వరంగల్, కాజీపేట స్టేషన్లలో, సికింద్రాబాద్-షాలిమార్ సూపర్‌ఫాస్ట్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774)కు జనవరి 7న వరంగల్, రాయనపాడు స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

యువగళం-నవశకం సువర్ణాధ్యాయం

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


కేక్ కట్ చేస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువగళం-నవశకం కార్యక్రమం ముగింపు రాష్ట్రంలో సువర్ణాధ్యాయంగా నిలిసిందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి , రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన యువగళం-నవశకం కార్యక్రమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని భూమాత లేఅవుట్‌లో శుక్రవారం కర్రోతు బంగార్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బంగ్రారాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయన్నారు. వారి భవిష్యత్తు నాశనమైందన్నారు. అటువంటి తరుణంలో యువ నేత లోకేశ్ యువగళం పేరిట పాదయాత్ర నిర్వహించి రాష్ట్రంలో యువతకు భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమం వైసీపీ నియంత్రత్వ పాలనకు చరమగీతం పాడిందన్నారు. బాబు సారధ్యంలో రాష్ట్ర పురోభివృద్ధికి ప్రతీ ఒక్కరు అడుగులు వేయాల్సిన సమయానికి నాంది పలికిందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను తాకుతూ చివరిగా విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఏర్పాటు చేసిన యువగళం నవశకం ముగింపు కార్యక్రమం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందిచంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్, కడగల ఆనంద్‌కుమార్, రాష్ట్ర బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దంగా భూలోక, కర్రోతు రాజు, పార్లమెంట్ కార్యదర్శి లంక అప్పలనాయుడు, నీలాపు అప్పలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డ కట్టిన నిర్లక్ష్యం!



రాజాం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారుల నిర్లక్ష్యానికి, దుబారాకు, లెక్కలేనితనానికో మచ్చుతునక ఈ చిత్రం. మండల పరిధిలోని పొగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలోని ఓ షెడ్‌లో గడ్డకట్టుకుపోయిన సిమెంట్ బస్తాలివి. సుమారు 300 బస్తాలు ఇలా వృథాగా పడిఉన్నాయి. ఏడాదిగా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడే గ్రామ సచివాలయ నిర్మాణంతో పాటు రైతు భరోసా కేంద్రం నిర్మాణం పనులు ప్రారంభించి సచివాలయ నిర్మాణం పూర్తిచేసిన అధికారులు రైతు భరోసా కేంద్రం ప్లాస్టరింగ్‌లు పూర్తిచేయలేదు. అయితే ఈ సిమెంట్ బస్తాలు ఏ శాఖకు సంబంధించినవో అధికారులే తేల్చాల్సి ఉంది.


గడ్డకట్టుకుపోయిన సిమెంట్ బస్తాలు

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో నేరాలను నియంత్రించేందుకు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అందుకు ఎంఎస్‌పీల సహకారం తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, ప్రాపర్టీ రూం, సెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అవసరమైన వాహనాలను యజమానులకు అప్పగించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు తరచూ జరిగే బ్లాక్‌స్పాట్స్ వద్ద ఇంజనీరింగు మార్పులు చేపట్టాలన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, భూ తగాదాలు, గొడవలు, రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్థులు, హిస్టరీ షీట్ కలిగిన వివరాలను మహిళా సంరక్షణ పోలీసులు ఉన్నతాధికారులకు అందించాలన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, సబ్బులు, పేస్టులు ఇతర వస్తువులు అందజేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్ కుమార్, ఎస్‌బీ సీఐ లీలారావు, పోలీసు అధికారులు, ఎంఎస్‌పీలు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

వీరభద్రపురం సోషల్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

హెచ్‌ఎంను బాధ్యతల నుంచి తప్పించిన డీఈవో

కొత్తవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరభద్రపురంలోనున్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జేవీ సన్యాసిరావును జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యాలనాయుడు శుక్రవారం విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావును విధుల నుంచి తప్పించారు. మరో సీనియర్ ఉపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించారు. సోషల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ మెయిల్ ద్వారా శుక్రవారం మధ్యాహ్నం డీఈవో ఉత్తర్వులు పంపించారని ఎంఈఓ జి.శ్రీదేవి తెలిపారు. గత కొద్ది రోజులుగా సెలవులో ఉన్న సన్యాసిరావు శుక్రవారమే మళ్లీ విధులకు హాజరయ్యారు. అదే రోజున సస్పెండ్ చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆ పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయురాలు తాను దళిత మహిళను కావడంతో తనను కులం పేరుతో ఉపాధ్యాయుడు సన్యాసిరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, మరో ఉపాధ్యాయుడు వేధిస్తున్నారని ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈఓ-2 బండారు శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఓ కె.వెంకట రమణను విచారణ కోసం డీఈవో పంపించారు. విచారణకు వచ్చిన వారికి విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఉపాధ్యాయురాలినే కాకుండా ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల బాలికల పట్ల సన్యాసిరావు అసభ్యంగా ప్రవర్తించడం, లైంగికంగా వేధించడం వంటివి చేస్తుంటారని బాలికలు తెలిపారు. దీంతో తనపై చర్యలు తప్పవని భావించిన ఆ ఉపాధ్యాయుడు సెలవు పెట్టేశారు. బాధిత బాలికల స్టేట్ మెంట్‌లను రికార్డు చేయాలని బుధవారం ఎంఈఓ-1 జి.శ్రీదేవి, డిప్యూటీ డీఈఓ వెంకట రమణను మరోసారి పాఠశాలకు విచారణకు పంపించారు. ఈ మేరకు వారు నివేదికను డీఈఓకు అందజేశారు. ఈ సస్పెన్షన్‌ను ఎంఈవో శ్రీదేవి ధ్రువీకరించారు.

రామతీర్థంలో సహస్ర శ్లోక పారాయణం

నెల్లిమర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం విశాఖపట్నానికి చెందిన భగవద్రామానుజ దాస బృందం ప్రతినిధి కందాళ రాజగోపాలాచార్యులు ఆధ్వర్యంలో సహస్ర శ్లోక రామాయణ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీమద్రామాయణంలోని 24 వేల శ్లోకాలను 1050 శ్లోకాలుగా సంకలనం చేసి సహస్ర శ్లోక రామాయణంగా పుస్తకం తయారు చేసినట్టు రాజగోపాలచార్యులు వివరించారు. దీనిని 108 ఆలయాల్లో పారాయణ చేయాలని సంకల్పించినట్టు వివరించారు. సింహాచలం, శ్రీరంగం, కాంచీపురం, పూరి వంటి 15 క్షేత్రాల్లో పారాయణం చేసినట్టు ఆయన తెలిపారు. రామతీర్థంలో 16వ పారాయణ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర స్వామి వారికి పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పారాయణం చేస్తున్న దాస బృందం సభ్యులు

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

జామి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏపీఈపీడీసీఎల్ సంస్థ విద్యుత్ పొదుపుపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కుమారాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.ఉషశ్రీ ప్రథమ స్థానం సాధించిది. శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థిని ప్రతిభ చూపిందని గైడ్‌టీచర్ శ్రీనువాసరావు తెలిపారు. ఆ సంస్థ అధికారులు విద్యార్థినికి బహుమతి, ప్రశంసాపత్రం అందించారు.

లఘు చిత్రాల పోటీలో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

దత్తిరాజేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఏపీఈపీడీసీఎల్ లఘు చిత్రాల పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో కొత్తవలస ఎంపీయూపీ పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి అందుకున్నారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న ఎం.నీలిమ, పి.మౌనిక, బి.ధనలక్ష్మి, గైడ్ టీచర్ ఎస్.రవీంద్ర పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారిగా శ్రీనివాసరావు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమా ధికారిగా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యత లు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు సాలూరులో బాధ్యతలను నిర్వహించే వారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, జేసీ సేతు మాధవన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నగర పాలక సంస్థకు అవార్డు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధనశాఖ ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ మిషన్ ప్రకటించిన సిల్వర్ అవార్డుని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అందుకున్నారు. శుక్రవారం విజయవాడలోని వివాంటా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ ఈ అవార్డుని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థకు సిల్వర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు పొందడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట నగర పాలక సంస్థ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

నాణ్యమైన ఆహారం అందించండి

గుర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇటీవల నిధులు విడుదలైన నేపథ్యంలో సంబంధిత జేఈ, ఈఈలతో కలిసి కేజీబీవీలో పనుల పురోగతిని చర్చించారు. కేజీబీవీకి సంబంధించి కొత్తగా లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ కు నిధులు మంజూరైనట్టు సంబంధిత అధికారులు ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు హాస్టల్‌లోని గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఇటీవల జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో హాస్టల్‌లో పరిశుభ్రమైన వాతావరణంతోపాటు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిరణ్‌కుమార్, గోవింద, అప్పలనాయుడు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు

సచివాలయ సిబ్బందిలో మార్పు రావాలి

రాజాం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పనితీరులో మార్పులు రావాలని ఎంపీడీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం బొద్దాం. గారాజు చీపురుపల్లి గ్రామాల్లో సచివాలయాను తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు తెచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలన్నారు. చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటి సమస్యలు రాకుండా..

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ వెంకట్ శుక్రవారం తెలిపారు. రేగిడి హెడ్ చానల్ దగ్గర విద్యుత్ సమస్యలు వస్తున్నాయని గుర్తించామన్నారు. అక్కడ కొత్తగా ఫీజులు ఏర్పాటు చేశామన్నారు. జీఎంఆర్‌ఐటీ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్రధాన రహదారి పనులు జరుగుతున్నందున తాగునీటి పైప్‌లైన్లు ఎప్పటికప్పుడు పాడవుతున్నాయని ఆయన చెప్పారు. వీటివల్ల ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుతీనగర్ నాలుగో లైన్‌లో కొత్తగా పైప్‌లైన్ వేసినట్టు ఏఈ చెప్పారు.

పంచాయతీకి హక్కులు వదిలేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీ చీడిపాలెం గ్రామానికి తాటిపూడి-విజయనగరం ప్రధాన రహదారి నుంచి జిందాల్ భూముల్లో నుంచి వేసే రోడ్డుపై హక్కులను పూర్తిగా పంచాయతీకి బదలాయించాలని గ్రామసభలో తీర్మానించారు. శుక్రవారం ఈమేరకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డుసభ్యులు మాట్లాడుతూ జిందాల్ కంపెనీ భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా పంచాయతీకి వదిలివేసేలా చూడాలని కోరారు. ఈ విషయంపై వైఎస్ ఎంపీపీ సుధారాజు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులు మాట్లాడుతూ షరతులతో కూడిన తీర్మానం రాయాలని సూచించారు. ఇక్కడ రోడ్డు నిర్మిస్తే భవిష్యత్‌లో ఎటువంటి అటంకాలు రాకుండా చూసుకుందామని సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు అన్నారు.

నేడు మండల సమావేశం

సంతకవిటి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ సిరిపురపు మంజు, ఎంపీడీఓ కె.సురేష్ కుమార్ తెలిపారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

న్యూస్ బాక్స్

అంటువ్యాధులపై అప్రమత్తం

కొత్తవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు సీతల్ వర్మ, గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఈ రెండు పీహెచ్‌సీలలో నిర్వహించిన సమావేశాలలో వీరు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలు, జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వేడినీటిని మాత్రమే తీసుకోవాలని, నిల్వ ఉంచిన ఆహారం, మాంసం వినియోగించవద్దని సూచించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

కొత్తవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశపాత్రునిపాలెం గ్రామంలో శుక్రవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అంతకుముందు క్షయపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం కమిషనర్ ఆదేశాలతో హెల్త్ కార్యదర్శులు సచివాలయాల పరిధిలో పర్యటిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలు లేకుండా చూడాలని అవగాహన కల్పించారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, తక్షణమే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తోటపాలెం సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్తలు గెదెల తిరుపతి, దుర్గాప్రసాద్, రామరాజు, నాయకులు శ్రీనివాస్, బంగారునాయుడు, అచ్చిబాబు, పద్మనాభం, మోహన్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి బేషరతుగా మోదీ, అమిత్‌షాలు జాతికి క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశభక్తి పేరుతో ఆంక్షలు విధిస్తూ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో సీపీఐ జెండాను ఎగుర వేసి సభలు, ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ ప్రతినిధులు బుగత అశోక్, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలి

రాజాం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తక్షణమే రాజీనామా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స బుద్ధుడు డిమాండ్ చేశారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్‌పై అమిత్ షా మాట్లాడిన తీరు సరికాదన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

దత్తిరాజేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంగిలాపల్లికి చెందిన నడుపూరి మోహన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని టీడీపీ నాయకుడు తాడ్డి రవి, కుటుంబీకులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.91,486 మంజూరు చేయించారు. మంత్రి శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు ఈ చెక్కును శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు రంధి అబ్దుల్, మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్య తరగతులు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్ సంస్కృత కళాశాలలోని ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్‌లో బీఏ, బీకాం ప్రథమ, ద్వితీయ సెమిస్టర్స్ వారికి వారాంతపు తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ జనార్దననాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 29 తేదీలు, 2025 జనవరి 5, 11, 12, 18, 19, 26, ఫిబ్రవరి 2, 9 తేదీల్లో తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 94920 21464 నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

క్రైం కార్నర్

సెప్టిక్‌ట్యాంక్ గోతిలో పడి బాలుడి మృతి

కొత్తవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంటకాపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం వద్ద సెప్టిక్ ట్యాంక్ కోసం తీసిన గోతిలో పడి రెండున్నరేళ్ల బాలుడు శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి సెప్టిక్ ట్యాంక్ కోసం నాలుగడుగులు గొయ్యిని తవ్వారు. ఈ గొయ్యిలో నందలు వేసి మీదను కప్పు వేయవలసి ఉంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గొయ్యి నీటితో నిండిపోయింది. శుక్రవారం గ్రామంలో ఒక పెళ్లి వేడుకకు సంబంధించిన ఊరేగింపు జరుగుతోంది. ఆ సమయంలో గ్రామానికి చెందిన తూరుబిల్లి దుశ్వంత్ (రెండున్నర సంవత్సరాలు) అటుగా వెళుతూ గొయ్యిలో పడిపోయాడు. ఈ విషయం ఎవరూ గమనించక పోవడంతో బాలుడు మునిగిపోయి మృతి చెందాడు. సాయంత్రానికి విగతజీవిగా తేలడంతో స్థానికులు గుర్తించారు. మృతుని తండ్రి శివ ప్రసాద్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సమాచారం అందుకున్న సీఐ షణ్ముఖరావు సంఘటనా స్థలానికి వెళ్లారు. తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వచ్చినట్టు వెంటనే కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

శృంగవరపుకోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు, ఒక యువకుడికి గాయాలయ్యాయి. స్థానిక పుణ్యగిరి రోడ్డులో బాలికల వసతి గృహం ఉంది. శుక్రవారం సాయంత్రం కళాశాల నుంచి వసతి గృహానికి విద్యార్థినులు వెళుతున్నారు. అదే సమయంలో ఈ రోడ్డులో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఇద్దరు విద్యార్థినులను ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని వీఆర్‌ఏకు గాయాలు

కొత్తవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కవరపుకోట వీఆర్‌ఏగ మాధవి తీవ్రంగా గాయపడ్డారు. తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన మాధవి విధులకు వెళ్లడానికి నడుచుకుని బ్రిడ్జి మీదకు వెళుతుండగా 12 డీ సిటీ బస్సు ఢీకొంది. ఆమె తీవ్రంగా గాయపడడంతో స్థానికుల సాయంతో చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు.

పొలంలోకి దూసుకుపోయిన బస్సు

గజపతినగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):మదుపాడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం బస్సు అదుపు తప్పి... పంట పొలాల్లోకి దూసుకు పోయింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం నుంచి జగదల్‌పూర్ వెళ్లే ఒడిశా ఆర్టీసీ బస్సు మదుపాడ జంక్షన్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పంట పొలాల్లోకి బస్సు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కళ్లెదుటే జరిగిన ప్రమాదానికి పలువురు భయాందోళనకు గురయ్యారు. ఆర్టీసీ సిబ్బంది సాలూరు వెళ్లే బస్సులో ప్రయాణికులను తరలించారు. పంట పొలాల్లో కూరుకు పోయిన బస్సును గ్రామస్తుల సహకారంతో ప్రేవేటు వాహనం ద్వారా బయటకు తీసుకువచ్చారు. అనంతరం బస్సును జగదల్‌పూర్‌కు తరలించారు.



పొలంలో ఉన్న బస్సు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శృంగవరపుకోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శృంగవరపు కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనాల మరమ్మతులకు, అభివృద్ధి పనులకు శుక్రవారం ఎంపీపీ సండి సోమేశ్వరరావు, ఏపీ టూరి జం శాఖ డైరెక్టర్, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజులు శుక్రవారం శంకుస్థాపన చేసారు. పుణ్యగిరి రోడ్డులోని బాలుర వసతిగృహంలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. ఈ రెండు పనులకు ఉపాధి హామీ పథకం నుంచి రూ.2లక్షల చొప్పున కేటాయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీడీఓ సతీష్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

జంతువు పాదముద్రలతో కలకలం



పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

సంతకవిటి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీహరినాయుడు పేట గ్రామంలోని పొలాల్లో శుక్రవారం కొందరు రైతులు పెద్ద పెద్ద అడుగులను గమనించారు. తమ పొలాల్లో పులి సంచరిస్తోందని భయభ్రాంతులకు గురయ్యారు. దీనితో విజయనగరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.సుబ్బారావు, బీట్ ఆఫీసర్ రామారావులు గ్రామాన్ని సందర్శించి పాదముద్రలను పరిశీలించారు. అవి పులి పాదముద్రలు కావని తెలిపారు. పెద్ద నక్క లేదా దుమ్మలగుండువి కావచ్చని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

జ్వరంతో గిరిజన బాలిక మృతి

భామిని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణిగ గ్రామానికి చెందిన నిమ్మల గౌతమి(10) అనే బాలిక గురువారం రాత్రి జ్వరంతో మృతి చెందింది. గత రెండు రోజుల కిందట గౌతమికి బాగోలేకపోవడంతో తల్లిదండ్రులు శాంతి, రమేష్‌.. భామిని పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ప్లేట్‌లెట్స్‌ తగ్గిపోయాయని మెరుగైన వైద్యం అందించేందుకు సీతంపేట గానీ, పాలకొండ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే వారు వెంటనే వెళ్లేందుకు వీలు కాకపోవడంతో గౌతమిని తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత ఆసుపత్రికి తీసుకెళ్దామని అనుకున్నారు. ఇంతలోనే గురువారం రాత్రి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌

బొబ్బిలి రూరల్‌, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ అన్నారు. మెట్టవలస సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కాసిందొరవలస, నారాయణప్పవలస గ్రామాల స్వామిత్వ సర్వే మ్యాప్‌లను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇళ్లు కలిగి ఉన్న గ్రామస్థులకు హక్కుల రికార్డు అందించి, వారికి బ్యాంకు రుణాలను పొందడానికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్‌, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి జి.సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు గ్రామీణ బ్యాంకు సేవలు నిలుపుదల

పార్వతీపురంటౌన్‌, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం(డీఎఫ్‌ఎస్‌) ఆదేశానుసారం ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంకు సేవలు నిలుపుదల చేస్తున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా రీజనల్‌ మేనేజర్‌ కె.అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంకు సేవలు అదే పేరుతో ఏపీలో కొనసాగుతాయని చెప్పారు. మూడు రోజుల పాటు సాంకేతిక సమస్యల కారణంగా రీజనల్‌ బ్యాంకు పరిధిలోగల అన్ని శాఖల్లో బ్యాంకింగ్‌ సేవలను ఖాతాదారులకు అందించలేకపోతున్నందుకు చింతిస్తున్నామని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మీ సమీప శాఖలను సంప్రదించాలని, ఖాతాదారులను కోరుతున్నామని తెలిపారు.

పవన్‌ కోసం ఎదురుచూపు



బైపాస్‌ వద్ద పవన్‌కల్యాణ్‌ కోసం ఎదురు చూస్తున్న జనం

రామభద్రపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, సాలూరు మండలాల్లో శుక్రవారం పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ రామభద్రపురం మండల కేంద్రం మీదుగా వెళ్లారు. ఆయన రాకకు ముందుగా జనసేన కార్యకర్తలు, అభిమానులు స్థానిక బైపాస్‌ రోడ్డు వద్ద భారీ ఎత్తున గుమికూడారు. జనసేన నాయకుడు పాలూరు బాబు ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు వచ్చారు. అయితే పవన్‌కల్యాణ్‌ కారులో నుంచే అభివాదం చేస్తూ సాలూరు వెళ్లిపోయారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూరల్‌ సీఐ కె.నారాయణరావు, టౌన్‌ సీఐ సతీష్‌కుమార్‌, ఎస్‌ఐలు వెలమల ప్రసాదరావు, సాగర్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో ఆధార్‌ శిబిరాలు

బొబ్బిలి రూరల్‌, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణకు గ్రామాల్లో ఆధార్‌ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో పి.రవికుమార్‌ తెలిపారు. మండలంలోని కారాడ, పారాది గ్రామాలలో ఏర్పాటుచేసిన ఆధార్‌ శిబిరాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ బయోమెట్రిక్‌ అప్డేట్‌ కోసం రూ.100, డెమోగ్రాఫిక్‌ అప్డేట్‌ కోసం రూ.50, కార్డు డౌన్‌లోడ్‌ కోసం రూ.30 చెల్లించాలని, ఆధార్‌ ఎన్‌రోల్‌మెంట్‌ ఉచితంగా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ డిజిటల్‌ అసిస్టెంట్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

బొబ్బిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిర్మల్‌ హృదయ్‌ కేంద్రంలో గల మానసిక దివ్యాంగులకు కారుణ్య ఫౌండేషన్‌, రోటరీ డిస్ట్రిక్ట్‌ చైర్మన్‌ జేసీ రాజు, సామాజిక కార్యకర్తలు గొర్లె శంకరరావు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. రూ.32వేలు విలువ గల దుస్తులను పంపిణీ చేసినట్టు జేసీరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహన

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీవరం మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్‌ కెరీర్‌ సర్వీస్‌ సంస్థ సభ్యుడు అజయ్‌కుమార్‌ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుతో పాటు అనేక సాఫ్ట్‌ స్కిల్స్‌ కమ్యూనికేషన్‌ స్కిల్‌ సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సభ్యులు కల్పన, కళాశాల ఎకనామిక్స్‌ లెక్చరర్‌ స్వరూప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలుంటే దరఖాస్తు చేసుకోండి

వీరఘట్టం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నడిమికెల్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే డీటీ జి.ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఏమైనా ఉన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

● కలెక్టర్‌ పారుల్‌ పట్వారి

ఒడిశా

రాయగడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని కలెక్టర్‌ పారుల్‌ పట్వారి అన్నారు. శుక్రవారం స్థానిక అటానమస్‌ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్‌ బాబిలత షారాఫ్‌ అధ్యక్షతన జరిగిన చొయితి క్రీడల ముగింపు వేడుకలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యా ర్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. గౌరవ అతిథిగా పురా ధ్యక్షుడు మహేష్‌ పట్నాయక్‌, జిల్లా క్రీడాధికారి షేక్‌ అలీనూర్‌ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్‌ పారుల్‌ పట్వారి

ఎన్నాళ్లిలా?

● అడుగడుగునా గుంతలు.. ఆపై వర్షం

● అధ్వానంగా మారుతున్న రహదారులు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



ఉల్లిభద్ర ప్రాంతంలో ప్రధాన రహదారి గోతుల్లో చేరిన వర్షపు నీరు

గరుగుబిల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల ఉన్న గుంతల రహదారులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారుతున్నాయి. పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గం ప్రమాదకరంగా తయారయ్యింది. ప్రధాన మార్గంలో చిన్నపాటి గోతులను పూడ్చి పెద్ద గోతులను విడిచిపెట్టారు. గతంలో గోతుల్లో వేసిన మట్టితో పాటు చిన్నపాటి రాళ్లు వేసి తదుపరి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గోతుల్లో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కోటవాని వలస నుంచి ఉల్లిభద్ర వరకు ఉన్న ప్రధాన రహదారి మార్గంలో ప్రయాణానికి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతు న్నారు. వర్షపు నీరు చేరడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదాదారులు అభివృద్ధికి చొరవ చూపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్నపాటి గుంతలనే పూడ్చేందుకు దృష్టి సారిస్తు న్నారు తప్ప రహదారిని పూర్తిస్థాయిలో మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టక పోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి మార్గంలో చినుకు పడితే చిత్తడిలా తయారై తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలన

బొబ్బిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బొబ్బిలిలోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్‌ కమిషనర్‌ లాలం రామలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. అమ్మిగారికోనేరుగట్టు రోడ్డులో ఏర్పడ్డ గుంతల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్నట్టు గుర్తించారు. మున్సిపల్‌ కూరగాయల మార్కెట్‌, మేదరబంద జంక్షన్‌లలో గల షాపింగ్‌ కాంప్లెక్స్‌లు ప్రమాదకరంగా ఉన్నట్టు స్థానికులు చెప్పడంతో వాటిని పరిశీలించారు. పలు మున్సిపల్‌ షాపుల్లో శ్లాబ్‌లు పెచ్చులు పూర్తిగా ఊడిపోయి మొత్తం ఐరన్‌ బయటకు కనిపిస్తోంది. వర్షాలు కురుస్తుండడంతో కారిపోతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉందన్నారు. తక్షణం ఈ షాపుల మరమ్మతుల కోసం అంచనాలను రూపొందించి పనులు చేపట్టాలని మున్సిపల్‌ ఏఈ గుప్తను కమిషనర్‌ ఆదేశించారు. మేదరబంద జంక్షన్‌లో డ్రైనేజీలు పూర్తిగా మురుగుతో నిండిపోవడంతో వాటిని పరిశుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మురళిని, ఇతర సిబ్బందిని ఆదేశించారు. రవాణాకు అనుకూలంగా లేని రోడ్లను సరిచేయాలని ఇంజనీర్లకు సూచనలిచ్చారు.



గుంతల్లో చేరిన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ రామలక్ష్మి

ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు

బొబ్బిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు వైష్ణవాలయాల్లో శుక్రవారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో విజయవాడకు చెందిన ప్రవచన కర్త తూపురాణి పద్మావతి తిరుప్పావై ప్రవచనాలు చెప్పారు. గోదాదేవి భక్తి ప్రాశస్త్యాన్ని, ధనుర్మాస విశిష్టతను వివరించారు. ఆలయ భక్తసంఘం, ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు.



వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పల్లకీ సేవ

సమస్యలు పరిష్కరించాలి

● గురుకుల పాఠశాలల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయుల నిరసన



వర్షంలో గొడుగులు వేసుకుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీతంపేట రూరల్‌, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్‌, కాంట్రాక్ట్‌ ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఐటీడీఏ గేటు వద్ద నిరసన తెలిపారు. వానను సైతం లెక్క చేయకుండా ఆందోళన చేపట్టారు. గత కొన్ని రోజులుగా వీరు శాంతియుత నిరసన దీక్షలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అడవితల్లి విగ్రహం వద్ద గొడుగులు వేసుకుని నిరసన తెలిపారు. టీఆర్‌టీయాతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పొరుగు సేవలు ఉద్యోగులు బి.గణేష్‌, భాగ్యలక్ష్మి, మోహన్‌రావు, రవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నడుమ బెల్ట్‌ దుకాణం

గజపతినగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో పాన్‌షాపు నిర్వహించడంతో పాటు అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారని స్థానికులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో మద్యం తాగిన సీసాలు, వ్యర్థాలను విడిచి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగు, పంచాయతీ ఇంజనీరింగ్‌, ఆంధ్ర ప్రాజెక్టు, హెల్తు వెల్‌నెస్‌ కేంద్రం, ప్రభుత్వ బాలికల హైస్కూలు దాదాపు ఒకేచోట ఉన్నాయి. వీటి నడుమ షాపు పెట్టి మద్యం అమ్మకాలు చేపట్టడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్ర వేళల్లో ప్రభుత్వ కార్యాలయాలు మూసివేసి ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారాయని వాపోతున్నారు. ఇటీవల గృహ నిర్మాణ శాఖ అధికారి కార్యాలయం ముందు మద్యం సీసాలు పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా నేటికీ చర్యలు లేవని అధికారులు అంటున్నారు. మరోవైపు రాత్రి సమ యంలో యువకులు గంజాయి తాగి రహదా రులపై అల్లరి చేస్తున్నారని చుట్టు పక్కల కాలనీవా సులు అంటున్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొళాయి పనులు పూర్తయ్యేదెప్పుడో?

భోగాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో ఇంటింటి కొళాయిల కోసం సీసీ రహదారులను తవ్వి.. పూడ్చకుండా వదిలేశారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రహదారుల తవ్వకాలు చేపట్టడం... వాటిని సరి చేయకపోవడంతో కొద్ది పాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో సీసీ రహదారులకు ఇరువైపులా వర్షంనీటితో బురదమయంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



వీధుల్లో తవ్విన గోతులు



బొడ్డవర వద్ద చెత్తను కాలుస్తున్న దృశ్యం

ఇలాగే వదిలేస్తారా?

● రోడ్డు పక్కన చెత్త కుప్పలు

● నిప్పు పెట్టడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

శృంగవరపుకోట రూరల్‌, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో విశాఖ-అరకు రహదారిని ఆనుకొని పంచాయతీ అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున చెత్తను వేయించడంతో పాటు దానిని కాల్చడంపై ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త సంపద కేంద్రంలో కాకుండా నడిరోడ్డుపై వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ● ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రవి శంకర్‌ను వివరణ కోరగా ఇక్కడ ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వేస్తున్నామని.. పది రోజుల తర్వాత ట్రాక్టర్లతో చెత్తసంపద కేంద్రం వద్దకు తరలిస్తున్నామని తెలిపారు.

రోగాలు ప్రబలకుండా చర్యలు

● తాగునీటి పథకాల్లో క్లోరినేషన్‌

గరుగుబిల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ కారణంగా వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్‌.గోపాలరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలతో పాటు పారిశుధ్య ప్రాంతాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కారణంగా తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పలుచోట్ల తాగునీటి పథకాల్లో క్లోరినేషన్‌ చర్యలు చేపట్టారు. అలాగే రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా మళ్లించాలన్నారు. మురుగు నిల్వలు తొలగించి క్లోరినేషన్‌ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఏనుగులపై చర్యలేవీ?

పాలకొండ, డిసెంబర్‌ 20 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలో ఏనుగుల గుంపు సంచరించి పంటలను నష్టపరచడంతో పాటు 11 మందిని పొట్టన పెట్టుకున్నా ప్రభుత్వాలకు మాత్రం చీమ కుట్టినట్టయినా లేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు విమర్శించారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. భామిని మండలంలో వంశధార నది పరివాహక ప్రాంతంలో గత వారం రోజులుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు వల్ల గిరిజనులు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. భామిని గ్రామానికి చెందిన గురుబిల్లి చల్లంనాయుడు 50 సెంట్లలో వేసిన ధాన్యం కుప్పను, మరో 50 బస్తాల ధాన్యం బస్తాలు చించివేసి చెల్లాచెదురు చేశాయని చెప్పారు. కొమరాడ, భామిని మండలాల్లో ఉన్న ఏనుగుల గుంపును తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆయన కోరారు.

న్యూస్‌ బాక్స్‌

అవార్డు బాధ్యత పెంచింది

● చినమేరంగి సీఐ తిరుపతిరావు



జియ్యమ్మవలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఐజీ ద్వారకా తిరుమలరావుతో జారీ చేసిన డీజీపీ కమెండేషన్‌ డిస్క్‌ అవార్డును అందుకున్న చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావుతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: మీ స్వస్థలం?

సీఐ: శ్రీకాకుళం జిల్లా సమీపంలోని పర్లాం గ్రామంలో డిసెంబరు 10, 1972లో జన్మించాను. పదో తరగతి వరకు శ్రీకాకుళంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్‌ జూనియర్‌ కాలేజీ పోలాకి గ్రామంలో, డిగ్రీ నరసన్నపేటలో పూర్తి చేశాను.

ప్రశ్న: పోలీస్‌శాఖలో మొట్టమొదట ఎప్పుడు ఏ పోస్టుకు ఎంపికయ్యారు?

సీఐ: 2000 సంవత్సరంలో విజయనగరం జిల్లా పోలీస్‌ కార్యాలయంలో ఎస్‌ఐగా ఎంపికయ్యాను. 2011లో భీమవరం రైల్వే సీఐగా పదోన్నతి లభించింది.

ప్రశ్న: డీజీపీ కమెండేషన్‌ డిస్క్‌-2022 అవార్డుకు ఎలా ఎంపికయ్యారు?

సీఐ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో విజయనగరం-1 ఎల్విన్‌పేట సర్కిల్‌ పరిధిలో 10 కీలక కేసులు నమోదు చేసి అందులో ఆరు కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడేలా చేయడం వల్ల ఎంపిక చేశారు. ఈ అవార్డుతో నాలో మరింత బాధ్యత పెరిగింది.

ప్రశ్న: ఇంతవరకు మీరు అందుకున్న అవార్డులు, రివార్డులు?

సీఐ: 1999లో చీఫ్‌ మినిస్టర్‌ రివాలర్‌ అవార్డు, ప్రతిష్టాత్మకమైన హోం మినిస్టర్‌ బ్యాటర్‌ ఇండోర్‌ అవార్డు, 2022లో ఉత్తమ సేవా పథకం అవార్డుతో పాటు 178 కమెండేషన్‌ లెటర్లు, 133 అభినందన లెటర్లు, 11 సార్లు క్యాష్‌ అవార్డులు అందుకున్నాను.

నేడు మండల సమావేశం

బొబ్బిలి రూరల్‌, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్‌ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.రవి కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్‌ ప్రాదేశిక సభ్యులు, కో-ఆప్టెడ్‌ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు అందరూ హాజరు కావల్సిందిగా కోరారు.

● బాడంగి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి సభ్యులే హాజరు కావాలని, వారి ప్రతినిధులకు పంపవద్దని ఎంపీడీవో ఎస్‌.రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు కూడా హాజరుకావాలన్నారు.